




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 344 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 29 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## 42 శాతం బీసీ రిజర్వేషన్లు..

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం!

- బీసీలకు రిజర్వేషన్లపై ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్
- రిజర్వేషన్లకు బీజేపీ శాసన సభలో ఆమోదం తెలిపిందన్న మంత్రి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోరేవారంతా తమతో కలిసి రావాలన్న మంత్రి



హైదరాబాద్ పెన్ పవర్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి వెళ్లనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రిజర్వేషన్లకు శాసనసభలో ఆమోదం తెలిపిన బీజేపీ, ఢిల్లీలో అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆగస్టు 5, 6, 7 తేదీలలో రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరేవారందరూ తమతో కలిసి ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని అన్ని పార్టీలలో ఉన్న బీసీ నాయకులు బీసీ రిజర్వేషన్ల కోసం సహకరించాలని కోరారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా రాష్ట్రంలో కులగణన చేశామని అన్నారు. ఎన్నికలు ఆలస్యమైతే స్థానిక సంస్థల నిధులకు చాలా ఇబ్బంది అవుతుందని ఆయన అన్నారు.

## 31 నుంచి మీనాక్షి పాదయాత్ర.. 7 రోజులు 6 నియోజకవర్గాలు

- పరిగి నుంచి షురూ చేయనున్న ఇన్ చార్జి
- ఈ నెల 31 నుంచి 6వ తేదీ వరకు షెడ్యూల్
- ప్రతి సెగ్మెంట్ లో 8 నుంచి10 కి.మీ పాదయాత్ర
- ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక సెగ్మెంట్ లో బస
- శ్రమదానం కూడా చేయనున్న ఏఐసీసీ ఇన్ చార్జి
- పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లు ఫైనల్



హైదరాబాద్ పెన్ పవర్: ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలోని ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు. ఇందుకోసం రూట్ మ్యాప్ సైతం సిద్ధమైంది. ప్రజలతో మమేకం కావడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. ఈ క్రమంలో శ్రమదానం కూడా చేయనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన జైభీమ్, జై బాపూ, జై సంవిధాన్ పై నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీనాక్షి భావిస్తున్నరని తెలుస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా ఆమె ప్లాన్ చేస్తున్నారు. పార్టీ గ్రామ, మండల నాయకుల మధ్య, మండల,నియోజకవర్గ నేతల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఆమె కృషి చేయనున్నారు. ప్రజలతో మమేకమైన క్రమంలో

వివరాలు 2లో..

## సిగాచీ ఘటనలో ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలి



- రూ. కోటి పరిహారం ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు కానీ: హరీశ్ రావు ఆగ్రహం
- సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధితులకు పరిహార అందలేదన్న హరీశ్ రావు
- బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని అదనపు కలెక్టర్‌ను కలిసిన హరీశ్ రావు
- పరిహారం అందకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్న మాజీ మంత్రి

వివరాలు 2లో..

### పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై

## కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఏపీ ప్రభుత్వం తెలిపిందన్న కేంద్రం
- రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్న
- లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర జల్ శక్తి శాఖ



హైదరాబాద్ పెన్ పవర్:పోలవరం – బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభు త్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టు పనులను ఇంకా చేపట్టలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు

వివరాలు 2లో..

## వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ... విపక్షాలపై భగ్గుమన్న రాజ్ నాథ్ సింగ్



- కొనసాగుతున్న పార్లమెంటు సమావేశాలు
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- తిప్పికొట్టిన రాజ్ నాథ్

హైదరాబాద్ పెన్ పవర్:రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో విపక్షాలు అడిగిన ప్రశ్నల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంటులో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపక్ష ఎంపీలు ఈ ఆపరేషన్‌లో భారత సైనికులకు జరిగిన నష్టం గురించి, ఎన్ని భారత విమానాలు కూల్చివేతకు గురయ్యాయి అనే దాని గురించి మాత్రమే ప్రశ్నించారని విమర్శించారు. ఇటువంటి ప్రశ్నలు దేశ ప్రజల మనోభావాలను ఏ మాత్రం ప్రతిబింబించవని సింగ్ అన్నారు.

వివరాలు 2లో..

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిల నియామకం

- దేశంలోని పలు హైకోర్టులకు 19 మంది జడ్జిలు, అదనపు జడ్జిల నియామకం
- జడ్జిలు, అదనపు జడ్జీల నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర
- వెల్లడించిన కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. దేశంలోని పలు హైకోర్టులకు చెందిన 19 మంది

వివరాలు 2లో..

## మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు!

### ఆపరేషన్ సిందూర్‌పై జైశంకర్ కీలక వ్యాఖ్యలు

- ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా నినదించిందన్న జైశంకర్
- కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయాన్ని కొట్టి పారేసిన జైశంకర్



హైదరాబాద్ పెన్ పవర్:ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని కేంద్ర మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని అన్నారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా ముక్తకంఠంతో నినదించిందని గుర్తు చేశారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను కుదర్చడంలో ట్రంప్ ప్రమేయాన్ని ఆయన కొట్టి పారేశారు. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, మురిద్కేలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తామని

వివరాలు 2లో..

## వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి



పెన్ పవర్ డెస్క్:సోమవారం ( జులై 28 ) కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వీఐపీ దర్శనాలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. సామాన్య భక్తుల సౌలభ్యం కోసం వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని అన్నారు వెంకయ్య నాయుడు. సోమవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి

వివరాలు 2లో..

## జైపాల్రెడ్డి రాజకీయ జీవితం ఆదర్శం

- తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకం
- హైదరాబాద్ అభివృద్ధిలో జైపాల్? పాత్ర ఎంతో ఉంది
- మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి
- జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన మంత్రులు, ప్రముఖులు



హైదరాబాద్ పెన్ పవర్: మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత జైపాల్‌రెడ్డి రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శమని కార్మిక, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పీవీఎన్ ఆర్ మార్గ్‌లోని జైపాల్‌రెడ్డి స్మారకం స్తూపం స్ఫూర్తి స్థల్ వద్ద ఈ రోజు మంత్రులు, ప్రముఖులు నివాళు లర్పించారు. మంత్రి వివేక్? వెంకటస్వామి కూడా పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపాల్ రెడ్డి విద్యార్థి నాయకుడి నుంచి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. ఆయన నిరంతరం డెమోక్రసి గురించి కొట్లాడారని, ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో ఆయన పోరాటం చేసిన తీరు గొప్పదన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన తమకు సలహాలు అందించారన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నపుడు ఒత్తిడిలో కూడా విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు.

వివరాలు 2లో..

## భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

- భారత్-పాక్ యుద్ధంలో జోక్యం చేసుకున్నానని మరోసారి ట్రంప్ వ్యాఖ్య
- నేను లేకుంటే ఆరు పెద్ద యుద్ధాలు జరిగేవన్న ట్రంప్
- యుద్ధం చేస్తే వాణిజ్య ఒప్పందాలు కుదర్చుకోనని చెప్పానని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్' నిలిచిపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు పాత పాట పాడారు! భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు తాను సరైన సమయంలో జోక్యం చేసుకున్నానని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోతే రెండు దేశాలు ఈపాటికి యుద్ధం చేస్తూ ఉండేవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా తాను ఆరు యుద్ధాలను నివారించానని చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు."నేనే లేకుంటే ఆరు పెద్ద యుద్ధాలు జరుగుతుండేవి. ఇందులో భారత్–పాకిస్థాన్ అతి పెద్దది. ఎందుకంటే ఈ రెండు అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వస్త్రాలు ప్రయోగిస్తే

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### కారును సరైన దారిలో నడిపించేదెవరు..
# కేసీఆర్ పూనుకోరా?

బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజల ఆదరాభిమానాలు గెలుచుకుని రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత వరసగా రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన పార్టీ గత ఎన్నికల్లో ఓటమి పాలు కాగానే పార్టీలోని అగ్రనేత ఇంట్లోనే ప్రత్యర్థులు బయలుదేరడం ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతుంది. వైసీపీ అధినేత జగన్ పరిస్థితి వేరు. ఆయన తన తండ్రి మరణం తర్వాత సొంతంగా వైసీపీని పెట్టుకున్నారు. అప్పటి వరకూ కలసిమెలసిన అన్నా చెల్లెళ్లు అధికారంలోకి వచ్చిన తర్వాత వేరుపడ్డారు. రాజకీయంగా విభేదాలు బయటపడ్డాయి. కానీ బీఆర్ఎస్ పరిస్థితి వేరు. నాటి టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రి కాగానే ఇక్కడ అన్నా చెల్లెళ్లకు పడటం లేదు.

**ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని...**

ఇది ఇప్పుడు అధికార పక్షానికి వరంగా మారింది. తెలంగాణలో ఏ సమస్యపైనా అధికార పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఉద్యమం చేయాలని భావించినా ముందు ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తూ కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఇది గులాబీ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. సొంత చెల్లెలు విమర్శలకు సమాధానం చెప్పలేని కేటీఆర్ ఫ్రస్టేషన్ లో తమపై లేని పోని నిందలు వేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఒంటికాలిపై లేస్తున్నారు. ముందు కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలోనూ తన ఫోన్ తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్అయి ఉంటాయని కవిత చేసిన వ్యాఖ్యలు కేటీఆర్ కు ఇబ్బందికరంగా మారాయి.

**కాంగ్రెస్ పై కాలుదువ్వుతుంటే...**

కాంగ్రెస్ పై కాలుదువ్వుతూ ముందుకు వెళదామని అనుకుంటే.. కవిత రూపంలో కాళ్లకు అడ్డంపడుతుదని అంటున్నారు. కల్వకుంట్ల కవిత తన సోదరుడితో రాజకీయంగా దూరమయ్యారు. ఆమె కనీసం తెలంగాణ భవన్ కు కూడా రావడం లేదు. అలాగే కేటీఆర్ కూడా కవిత పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తున్నారని, ఆమె జాగృతి తరుపున చేసే కార్యక్రమాలకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ వెళ్లవెద్దని ఆంక్షలు పెడుతున్నారని కవిత సన్నిహితులు ఆరోపిస్తున్నారు. తాను కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని, మరొకరి లీడర్ షిప్ తనకు అవసరం లేదని కవిత తెగేసి చెబుతున్నారు. కవిత, కేటీఆర్ ఉప్పునిప్పులా మారడంతో పాటు పార్టీతో పాటు ఇతర కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు.

**కేసీఆర్ జోక్యం చేసుకోరా?**

బీఆర్ఎస్ ను బీజేపీలో కలిపిందుకు కుట్ర జరుగుతుందని, దానిని తాను అడ్డుకున్నానని గతంలో కవిత రాసిన లేఖ సంచలనమే అయింది. తాజాగా సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు కూడా కవితకు ప్లస్ గా మారాయి. తాను చెప్పిందేనిజమని ఆమె సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కేటీఆర్ బయటకు చెప్పకపోయినా కవిత పట్ల ఇప్పుడు కఠినంగా వ్యవహరించకుంటే భవిష్యత్ లో కష్టమేనని భావించి రానున్న కాలంలో పార్టీ పదవుల విషయంలో తన వర్గం వారికే ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో కేసీఆర్ కూడా ఇద్దరి మధ్య సయోధ్యకు పెద్దగా ప్రయత్నించకపోవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. కుటుంబ పెద్దగా ఇద్దరినీ కూర్చోబెట్టి ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలను తొలగించే ప్రయత్నం చేయాలని పార్టీ నేతలతో పాటు క్యాడర్ కోరుకుంటున్నారు. ఇద్దరి మధ్య తాము నలిగిపోతున్నామని చెబుతున్నారు.

# సిగాచీ ఘటనలో ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలి

సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం అందేలా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరిహారం అందలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పరిహారం ఎప్పుడు ఇస్తారని వారు నిలదీస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. కొన్ని కుటుంబాలకు లక్ష రూపాయలు మాత్రమే పరిహారం అందిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు, క్షతగాత్రుల వివరాలను ఇంకా ప్రకటించలేదని విమర్శించారు. ఎంతమందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

## జైపాల్‌రెడ్డి రాజకీయ జీవితం ఆదర్శం

- మొదటి పేజీ తరువాయి

మంత్రులు పొన్నం ప్రభాకర్?, కోమటిరెడ్డి వెంకట్?డ్డి మాట్లాడుతూ తాము కొత్తగా పార్లమెంట్?లో అడుగు పెట్టినప్పుడు జైపాల్?రెడ్డి వద్ద పార్లమెంటరీ విధానం గురించి తెలుసుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఎలా ముందుకు వెళ్లాలనే విషయమై ఆయన ఎంపీలకు సలహాలిచ్చే వారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్?కు మెట్రోతో పాటు ఇతర ప్రాజెక్టులను అందించి అభివృద్ధి చేసిన ఘనత ఆయనదే అన్నారు. మాజీ గవర్నర్? బండారు దత్తాత్రేయ స్ఫూర్తిస్థల్? వద్ద నివాళులర్పించి మాట్లాడారు. జైపాల్?రెడ్డి నాయకుడు మాత్రమే కాదు మంచి విమర్శకుడు కూడా అన్నారు. కేంద్ర మంత్రిగా మంచి విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. అవినీతిని సహించని వ్యక్తి జైపాల్ రెడ్డి అన్నారు.

## వీఐపీలు ఏడాదికోసారి మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి

- మొదటి పేజీ తరువాయి

తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆలయంలో స్వామివారి దర్శనానికి ఉండే స్థలం, సమయం పరిమితంగా ఉండటంతో బయట ఎంత మంచి ఏర్పాట్లు చేసినా రద్దీ కారణంగా భక్తులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు వెంకయ్య నాయుడు.

సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకొని వీఐపీలు ఏడాదికి ఒకసారి మాత్రమే పరిమిత సంఖ్యలో కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకోవాలని.. అప్పుడే దేవస్థానం నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందని అన్నారు.ప్రజా ప్రతినిధులంతా బాధ్యతతో హుందాగా తన సూచనను పాటించాలని కోరారు వెంకయ్య నాయుడు. సామాన్య భక్తులు

## 31 నుంచి మీనాక్షి పాదయాత్ర..
## 7 రోజులు 6 నియోజకవర్గాలు

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును కూడా ఆమె స్వయంగా అడిగి తెలుసుకోనున్నారని సమాచారం. ఇవాళ సాయంత్రం ఆమె హైదరాబాద్ చేరుకోనున్నారు. మీనాక్షి 15 రోజుల పాటు రాష్ట్రంలోనే ఉండనున్నారు. రేపు ఉదయం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తో సమావేశమవుతారు.

అనంతరం ఉమ్మడి జిల్లాల పార్టీ ఇన్ చార్జీలతో ఎమ్మెల్యే క్వార్టర్స్ లో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 31 నుంచి ఏడు రోజుల పాటు ఆమె జిల్లాల్లో పర్యటిస్తారని సమాచారం. తొలుత పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. తొలి దపాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస చేయాలని ఆమె భావిస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలను కవర్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. .

## భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

- మొదటి పేజీ తరువాయి

యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి ఘోర పరిస్థితులు ఉండేవి. భారత్, పాక్ దేశాలకు చెందిన నేతలు నాకు బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని స్పష్టం చేశాను" అని పునరుద్ఘాటించారు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ ఇదివరకే పలుమార్లు వ్యాఖ్యానించారు.

## వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ...
## విపక్షాలపై భగ్గుమన్న రాజ్ నాథ్ సింగ్

- మొదటి పేజీ తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గట్టిగా నొక్కి చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క భారతీయ సైనికుడికి కూడా హాని జరగలేదని ఆయన స్పష్టం చేశారు. "భారత సైన్యం ఎన్ని శత్రు విమానాలను కూల్చివేసింది? ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయా?" వంటి ప్రశ్నలు విపక్షం ఎందుకు అడగలేదని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఈ వారు ఈ ప్రశ్నలు అడిగితే తమ వద్ద స్పష్టమైన సమాధానాలు ఉన్నాయని అన్నారు. జాతీయ భద్రతపై దృష్టి సారించాలని, సాయుధ దళాల స్థైర్యాన్ని దెబ్బతీయవద్దని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. ఆపరేషన్ విజయం గురించి ఇప్పటికే తెలియజేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షం ప్రజా సమస్యలకు సంబంధించిన అర్థవంతమైన, బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగడమే వారి పాత్ర అని సింగ్ అన్నారు.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

తెలియజేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసినట్లు పార్లమెంటుకు తెలిపింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

## మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు!

- మొదటి పేజీ తరువాయి

ఎవరైనా ఊహించారా అని ప్రశ్నించారు. పాక్ ఎదురుదాడులను సమర్థంగా ఎదుర్కొన్న తర్వాత దాడులు నిలిపివేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అటు నుంచి ఫోన్లు వచ్చాయని తెలిపారు. కానీ డీజీఎంవో నుంచి విజ్ఞప్తి రావాలని తాము తేల్చి చెప్పామని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి కారణమైన టీఆర్ఎఫ్‌ను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించిందని గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి ఘటనను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, క్వాడ్, బ్రిక్స్‌తో పాటు వివిధ దేశాలు ఖండించాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించారు.

పాకిస్థాన్, చైనాల పరస్పర సహకారం ఆరు దశాబ్దాలుగా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. చైనాతో వ్యవహరించాల్సిన తీరుపై ప్రతిపక్షాలు ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనడానికో, రహస్య ఒప్పందాలు చేసుకోవడానికే తాము చైనాకు వెళ్లలేదని ఎద్దేవా చేశారు. తాను చైనాకు వెళ్లింది తీవ్రవాదం మన పంథా వివరించేందుకు, వాణిజ్య ఒప్పందాల గురించేనని చెప్పారు.

## క్రీడలతో పర్యాటక, వాణిజ్య రంగాల వృద్ధి సాధ్యం: సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్లో సీఎం చంద్రబాబు

క్రీడలతోనూ పర్యాటక-వాణిజ్య రంగాల్లో వృద్ధి సాధ్యమని...అందుకే ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు అత్యధిక ప్రాధానత్య ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అత్యుత్తమ క్రీడాకారుల్ని తయారు చేయటంతో పాటు క్రీడా సదుపాయాలు, పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీ స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని అన్నారు. సోమవారం నాడు సింగపూర్ పర్యటనలో రెండో రోజున సీఎం చంద్రబాబు ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, మంత్రులు, అధికారులతో కలిసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూలును సందర్శించారు. అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయటంతో పాటు వినోదం, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రాలుగా స్పోర్ట్స్ స్కూళ్లు ఉండాలని సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఓంగ్ కిమ్ సూన్‌తో ముఖ్యమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న సంకల్పంతో తాము పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు చెప్పారు.

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్లను 2 నుంచి 3 శాతానికి పెంచామని, అలాగే ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్ షిప్స్, నేషనల్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచామన్నారు. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్లు, రజతం సాధిస్తే రూ.5 కోట్లు, కాంస్య పతకం పొందిన వారికి రూ.3 కోట్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఒలింపిక్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిల నియామకం

- మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తుల నియమకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం పలువురు న్యాయవాదులు, జ్యుడీషియల్ ఆఫీసర్లను న్యాయమూర్తులుగా, అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సిఫార్సు చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.ఈ మేరకు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రకటన విడుదల చేశారు. నియామకం పొందిన 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులుగా గౌస్ మీరా మొహియుద్దీన్, చలపతిరావు సుద్దాల, వాకిటి రామకృష్ణారెడ్డి, గడి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. వీరితో పాటు మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు న్యాయమూర్తులు, నలుగురు అదనపు న్యాయమూర్తులు, గౌహతి హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు.

## రాష్ట్రాభివృద్ధిలో తెలుగువారంతా భాగస్వాములు కావాలి: మంత్రి లోకేశ్

సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఆయనతో పాటు మంత్రుల బృందం కూడా అక్కడ పర్యటిస్తోంది. ఈ బృందంలో ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కూడా ఉన్నారు. ఈ రోజు తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లతో లోకేశ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత అయిదేళ్ల విధ్వంస పాలన చూశాక రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు విదేశాల్లో ఉన్న తెలుగువారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని అన్నారు. అందుకే ఏ దేశం వెళ్లినా సీఎం చంద్రబాబు, తాను తొలుత తెలుగువాళ్లను కలవాలని నిర్ణయించుకున్నామని అన్నారు. సింగపూర్ అభివృద్ధి చెందిన తీరును మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని, ఇక్కడ ఉన్న తెలుగు వారంతా రాష్ట్రాభివృద్ధి లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావడం వల్ల రాష్ట్రం ఊపిరి తీసుకుంటోందని తెలిపారు. ప్రధాని మోదీ త్వరలోనే సింగపూర్ లో పర్యటిస్తారు. ఆ పర్యటనలో పెద్ద ఎత్తున తెలుగువారు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని మంత్రి లోకేశ్ కోరారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లను అభినందించిన లోకేశ్ వారితో ఫొటోలు దిగారు.

## హుకుంపేట గిరిజన సంక్షేమ బాలురు 2వ ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి.

- అదనపు తరగతి భవనాలు, మరియు
- డైనింగ్ హాల్ నిర్మించాలి.
- ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన.
- హాస్టల్స్ సర్వేల్లో భాగంగా ఆదివారం స్కూల్ కి వెళ్లి సమస్యలు తెలుసుకున్నా అఖిల భారత విద్యార్థి సమాఖ్య.
- ఏ ఐ ఎస్ ఎఫ్ బృందం.



**పెన్ పవర్ హుకుంపేట జులై28** హుకుంపేట మండల కేంద్రం లో ఉన్న2వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరం చేయాలనీ, అదనపు తరగతి భవనం మరియు డైనింగ్ హాల్ నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఎస్ ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేశారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్ మీడియా తో మాట్లాడుతూ హుకుంపేట మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ భవనాన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కోసం తీసుకున్నారన్నారు. అయితే ఇంటర్మీడియట్, మరియు పాఠశాల విద్యార్థులు ఒకేదగ్గర హాస్టల్స్ ఉండటం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భోజనం చేయడానికి డైనింగ్ హాల్స్ కూడా లేకపోవడం వల్ల అరుబయటలోనే భోజనం చేస్తున్నారన్నారు. స్కూల్ విద్యార్థులకు తరగతి మరియు పడుకోవడానికి ఒకే గది అవ్వడం వల్ల చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసారన్నారు. ఇప్పటికైనా ఐ టి డి ఏ పి ఓ, కలెక్టర్, ప్రభుత్వం స్పందించి పాఠశాలను పరిశీలించాలన్నారు. తరగతి గదులు చాలకపోవటం వల్ల అదనపు తరగతి భావనాలను, భోజనం చేయడానికి డైనింగ్ హాల్ లను త్వరగా నిర్మించి విద్యార్థులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు వి. కృష్ణ, సహాయ కార్యదర్శి తనీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగష్టు 2 నుండి ఆకాంక్ష హాట్

- జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 28:** సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారో కార్యక్రమంలో భాగంగా ఆగష్టు 2 నుండి ఆకాంక్ష హాట్ కార్యక్రమాన్ని నిర్వహింస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు.

సోమవారం జిల్లా కలెక్టరెట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడతో కలసి మాట్లాడుతూ యాస్పిరేషన్ జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎంపిక కావడం సంతోషంగా ఉందని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు.రంపచోడవరం డివిజన్లో గంగవరం, మారేడుబిల్లి, మైలవరం ఒక యాస్పిరేషన్ గా గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో హెల్త్ అండ్ న్యూట్రిషన్, వ్యవసాయం, విద్య, మోడల్ స్కూల్, సోషల్ డెవలప్మెంట్ అనే 6 అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నీతి అయోగ్ క్రింద జిల్లాకు రూ: 10కోట్లు ఇన్సెంటివ్ ఇవ్వడం జరిగిందన్నారు. కాఫీ పంట ఇతర ఉద్యాన పంటలను మేడిన్ అరుకుగా బ్రాండ్ తీసుకురావడంతో గిరిజన రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు. ప్రత్యేక స్కూల్, టీచర్లు, వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆగష్టు 2వ తేదీన వివిధ శాఖల్లో, వివిధ స్థాయిలో బాగా పనిచేస్తున్న ఉద్యోగులను సన్మానించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఆగస్టు 2వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆకాంక్ష హాట్ కాఫీ హౌస్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆకాంక్ష హాట్ కి ప్రజలు సందర్శించి ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.

## జర్రెలలో శిధిల వ్యవస్థలో ఉన్న జిసిసి డిపో స్థానంలో నూతన భవనం నిర్మించాలి

- మండల వైసీపీ అధ్యక్షులు కంకిపాటి గిరిబాబు డిమాండ్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల గ్రామ పంచాయతీ కేంద్రంలో శిధిలావస్థలో ఉన్న జీసీసీ డిపో స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని వైఎస్సార్సీపీ జీకే వీధి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జర్రెల పంచాయతీ పరిధిలో సుమారు 25 పైచిలుకు గ్రామాలు ఉండగా, వాటి ప్రజలందరికీ ఇక్కడే రేషన్ అందుతుంది. అయితే పంచాయతీ కేంద్రానికి కొన్ని గ్రామాలు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు."గతంలో వైసీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసేది. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎండియుల ద్వారా బియ్యం పంపిణీ వ్యవస్థను నిలిపివేయడంతో ప్రజలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శీఘ్రంగా ప్రభుత్వం స్పందించి కొత్త జీసీసీ డిపో నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి" అని గిరి ప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు రీమల బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల కార్యదర్శి పాతూను లక్ష్మణ్, మండల కార్యవర్గ సభ్యులు వంతల రాజారావు, ముప్వల చిన్నబ్బాయి మరియు జర్రెల పంచాయతీ వైసీపీ నాయకులు స్వామినాథం, సింహచలం, గోపాల్ కృష్ణ, రాజారావు, పాస్టర్ హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాలి..



జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్..

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, జూలై 28 :** ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమ వారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, ఐటీడీఏ స్థాయిలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల నిర్వహణకు అనువైన ప్రదేశాలను ముందుగా గుర్తించాలని, గిరిజన సంస్కృతి ప్రతిబింభించేలా వేడుకలు జరగాలని పేర్కొన్నారు. సజావుగా వేడుకలు జరిగేందుకు నిర్వహణ కమిటీలను నియమించుకోవాలని, ఆదివాసీల సాంస్కృతిక, విలువిద్యను ప్రదర్శించేలా ఏర్పాట్లుచేయాలని అన్నారు. అలాగే గిరిజన సంప్రదాయ వస్తువులు, పనిముట్లు, ఇతర సామాగ్రిని ప్రదర్శించేలా ఒక మ్యూజియం,గిరిజన సంప్రదాయ దుస్తులతో ఫోటోలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటుచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ద్వారా గిరిజన లబ్ధిదారులకు భూపట్టాలు, ఉపకరణాలు, చెక్కులు వంటివి పంపిణీ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత వేడుకల్లో జరిగిన లోటుపాట్లను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయడానికి ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటిడీఏ ప్రాజెక్ట్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, డిఆర్డిఏ, డ్వామా పీడీలుఎం.సుధా రాణి, కె.రామచంద్రరావు, జిల్లా అటవీ శాఖాధికారి జి.ఏ.పి.ప్రసూన, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి డి.సత్య నారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎ.మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో మరణించిన కుటుంబానికి ప్రభుత్వం 5 లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలి.





- ఆదివాసి గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటీ.
- వ్యాధిపై శాశ్వత పరిశోధన కేంద్రం ఏర్పాటు చెయ్యాలీ.

**పెన్ పవర్ హుకుంపేట జూలై 28.**సికిల్ సెల్ తో బాధపడుతున్న వ్యాధి గ్రస్తులందరికీ షరతులు లేకుండా అందరికీ పెన్షన్ అందించాలి మరియు ఉచితంగా రక్తం, మరియు పౌష్టిక ఆహారం అందించాలి. అనిఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర డిమాండ్ చేశారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో మరణించిన

హుకుంపేట ముల్యాపుట్ గ్రామానికి చెందిన బండంగి పావని 18 కుటుంబానికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర,మహిళ సంఘం జిల్ల కార్యదర్శి ఎస్, హైమావతి, హుకుంపేట మండల కార్యదర్శి టీ.కృష్ణ రావు బృందం పరామర్శించారు.అనంతరం వారు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ

హుకుంపేట మండలం ములియాపుట్టు గ్రామ నివాసి బండంగి పావని (18) విశాఖ ఉమెన్స్ కాలేజీ లోని ఇంటర్ మీడియాట్ రెండవ సంవత్సరంలో చదువుకుంటూ ఏం,వి,పీ మహిళ గిరిజన సంక్షేమ హాస్టల్ లో ఉండేది సిసిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ తేదీ 27,7,2025 కేజీహెహెచ్ లో మరణించారు. అన్న విషయం అందరికి విదితమే ఈ సందర్బంగా.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్, హైమావతి ఆదివాసీ గిరిజన సంఘం హుకుంపేటకార్యదర్శి టీ. కృష్ణ రావు మాట్లాడుతూ.

చనిపోయిన పావని కుటుంబానికి 5 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో ఏజెన్సీలో 2300 మంది బాధపడుతున్నారని అందులో 1300 మందికే మాత్రం పెన్షన్ ఇస్తున్నారని మిగత 1000 మందికి పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ అందించాలని వారు డిమాండ్ చేశారు

ప్రభుత్వం వ్యాధి గ్రస్తులకు ఉచితంగా రక్తం మరియు

పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు వ్యాధి జన్యు సంబంధ పరమైన వ్యాధి కనుక పాడేరు మెడికల్ కాలేజీ అధ్యర్యన్న పరిశోధన కేంద్రం ఏర్పాటు చెయ్యాలనీ వారు డిమాండ్ చేశారు రాష్ట్రంలో అన్ని జిల్లాలకన్నా అల్లూరి సీతారామరాజు జిల్లా లోనే అత్యధికంగా సుమారు 4,30000 మందికి ప్రభుత్వం పరీక్షలు జరిపితే 2300 మందికి సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందినీ ప్రభుత్వం నమోదు చేసినట్టు వారు తెలియజేశారు ప్రభుత్వం తక్షణమే పాడేరు ఏజెన్సీలో శాశ్వత సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణకు ప్రత్యేక పరిశోధన కేంద్రం ఏర్పాటు చెయ్యాలనీ డిమాండ్ చేశారు

## కూటమి ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం...

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి..





**గుమ్మలక్ష్మీపురం జులై.28.పెన్ పవర్..** కురుపాం నియోజకవర్గం, గుమ్మలక్ష్మీపురం మండలంలో దిగువమండ, మల్లుగూడ, ఎగువమండ గ్రామాల్లో సోమవారం నాడు మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ముందుగా టీడీపీ శ్రేణులు,గ్రామస్తులు పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే.పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి,సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామని,ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం.పింఛన్ రూ.1000 పెంచడానికి జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పడితే చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో పింఛను రూ.4000 వేలకు పెంచారు.ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం,మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం,ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నాం. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ అందజేస్తాం,మెగా డీఎస్సీతో 13 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసాం.కానీ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క టీచరు పోస్టు భర్తీ చేసిన పాపాన పోలేదు.చంద్రబాబు అన్న క్యాంటీన్ తో పేదల ఆకలి తీర్చితే జగన్మోహన్ రెడ్డి అన్న క్యాంటీన్ రద్దుచేసి పేదల కడుపు కొట్టారు.చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు,స్థానిక సర్పంచ్ హైమావతి,నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, బిజెపి ఎస్టి మోర్చ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం,నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి,కిల్లక శాంతకుమార్,కద్రక అప్పలస్వామి,తాడంగి రామారావు,బిజెపి జనరల్ సెక్రెటరీ నిమ్మక భాస్కర్ రావు,యూనిట్ ఇన్చార్జ్ చిన్న,బూత్ కన్వీనర్ లింగరాజు,దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, కూటమి నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**28 వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు నగర మేయర్ శంకుస్థాపన**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్ జులై 28 :** ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివా సరావు పేర్కొన్నారు . సోమవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ 28వ వార్డు పరిధిలోని రామ్ నగర్ లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హెూల్స్ మర మ్మత్తులు, నిర్మాణ పనులకు తూర్పు నియోజ కవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వార్డ్ కార్పొరేటర్ పల్లా అప్పలకొండతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు నాయక త్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభి వృద్దే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరి చేందుకు జీవీఎంసీ అన్ని చర్యలు చేపడు తుందని తెలిపారు. 28వ వార్డులో జీవీఎంసీ నిధులతో రామ్ నగర్ లోని నెహ్రూ నగర్ సచివాలయం, దుర్గా మల్లేశ్వరి గుడి తదితర ప్రాంతాలలో సుమారు రూ. 39.72 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, మ్యాన్ హెూల్స్ మరమ్మత్తులు, నూతనంగా నిర్మించేందుకు శాసనసభ్యులతో కలిసి భూమి పూజ చేసామన్నారు.అనంతరం తూర్పు నియోజ కవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖను ఆర్థిక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి కార్యక్ర మాలు చేపడుతున్నారని, ముఖ్యంగా నగరం లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు, కాలువలు, పారిశు ధ్యం, భూగర్భ మురుగునీటి వ్యవస్థ మొదలై నవి అభివృద్ధి చేస్తే విశాఖకు అధిక శాతం పెట్టు బడి వస్తుంది అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 28వ వార్డులో సుమారు రూ.40 లక్షలు జీవీఎం సీ నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులు మేయర్ తో కలిసి భూమి పూజ చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షులు నక్కా కనకరాజు, అన్నపూర్ణ, పల్లా దుర్గ, శ్యామల, ఉరుకూటి పైడిరాజు, ఢిల్లేశ్వరి, జీవీఎంసీ సహాయక ఇంజనీరు విల్సన్, వార్డు సచివాలయం




కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# టీడిపి నేత సుభాష్ మృతి పార్టీకి తీరనిలోటు





- టీడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ.
- సుభాష్ పార్థీవదేహాన్ని నివాళులర్పించిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 28.** మండలంలో గల పనసపుట్టు పంచాయితీ కడుతుల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు గెమ్మిలి సుభాష్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, పాడేరు డివిజన్ నాయకులు పాంగి పాండురంగస్వామి, టిడిపి శ్రేణులు గ్రామంలో చేరుకుని సుభాష్ పార్థివ దేహాన్ని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిడిపి నాయకుడు మరణం పార్టీ తీరని లోటని, మంచి నాయకుని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, పార్టీ కొరకు ఎంతో కష్టపడ్డారని, ఆయన అనారోగ్యంతో మృతి చెందటం ఎంతో బాదేస్తుందన్నారు. కుటుంబాన్ని పరామర్శించి అధైర్య పడొద్దని, ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మృతుని కుటుంబానికి టిడిపి అధ్యక్షురాలు సన్యాసమ్మ 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే వైఎస్ఆర్సిపి అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ అరబిరు జగబంధు, వైసిపి నాయకులు కాంతరి సురేష్, రామమూర్తి, సిపిఎం నాయకులు కొర్రా త్రినాథ్, ఎంఎం శ్రీను, గాసిరం దొర, బీఎస్పీ నాయకులు మాధవరావు, బిజెపి నాయకులు లక్ష్మణ్ లు, మృతుడు సుభాష్ పార్థివ దేహాన్ని నివాళులు అర్పించారు. సుభాష్ మరణంతో కడుతుల గ్రామం శోకసంద్రంలో మునిగిపోయాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి కొంతేరి జగత్ రాయ్, వనబసింగి సర్పంచ్ లక్ష్మణ్, టిడిపి నాయకుడు గడ్డంగి రామ్మూర్తి, కిలో బలరం, కిరసాని లైకొన్, చిన్ని బాబు, కిషోర్, రామారావు, సరిహద్దు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ పోస్టులకు పోటీ పడుతున్న సబ్జెక్టు ఉపాధ్యాయులు

**అనంత గిరి జులై 28. పెన్ పవర్** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ పోస్టులకు పోటీ పడుతున్న సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, అరకులోయ, అనంతగిరి, డుంబ్రి గూడ మండలాల పరిధి ఆశ్రమ పాఠశాల ల్లో గత ఏడాది డిప్యూటీ వార్డెన్లు గా బాధ్యతలు నిర్వహించిన ఉపాధ్యాయుల పదవి కాలం జులై 31తో ముగుస్తుండటంతో నూతన డిప్యూటీ వార్డెన్లు గా బాధ్యతలు నిర్వహించేందుకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల తో గట్టిగా మంతనాలు నిర్వహించి డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు చేజిక్కించుకునేందుకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు ఎంతైనా ఖర్చు చేసేందుకు ముందుకు వస్తున్నారని వినికిడి, అందుకు నిదర్శనం డుంబ్రిగుడ, అరకు లోయ మండలాల్లో జరుగుతున్నట్లు ఊపాద్యాయులు చెవులు కొరుకునే పరిస్థితి, డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యతలు నిర్వహిస్తే వారి సబ్జెక్ట్ ఎవరు చెబుతారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్ని ప్రశ్నిస్తున్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు డిప్యూటీ వార్డున్లు గా బాధ్యతలు నిర్వహించడంతో గత మూడు సంవత్సరాల నుంచి పది ఉత్తీర్ణశాతం 90శాతం డీలా పడ్డాదని, ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్లుగా పిఈటీలకు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు. ప్రధానంగా డిప్యూటీ వార్డున్లు గా బాధ్యతలు నిర్వహించే ఉపాధ్యాయులు మెనూ సక్రమంగా అమలు చేయరని, చేతి వాటం అధికం గా నిర్వహిస్తారని, దీన్ని గమనించి ఆయా పాఠశాలల్లో విదులు నిర్వహించే పీఈటీలకే బాధ్యతలు అప్పగించాలని, లేదంటే హాస్టల్ వెల్ఫేర్ అధికారులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా అధికారులకు కోరుతున్నారు.

## ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధిపై సమీక్షా సమావేశం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జులై 28:** గూడెం కొత్తవీధి మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో మహేష్‌తో కలిసి అన్ని పంచాయతీల సెక్రటరీలతో గ్రామాభివృద్ధి కార్యాచరణలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పి4 సర్వే మార్గదర్శకాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, అలాగే తల్లికి వందనం పథకం కింద పెండింగ్ ఉన్న కేసుల్లో కేవైసీ పూర్తి చేయడం గురించి వివరించారు. ఇకపై ప్రతి నెల 5వ తేదీన "మనమిత్ర" ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పుట్టినతేది ధృవీకరణ పత్రం (బర్త్ సర్టిఫికెట్) లేని చిన్నారుల వివరాలు సేకరించి, సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సెక్రటరీలు ఆధార్ నమోదుకు సహకరించాలని సూచించారు. అలాగే, పింఛన్ల పంపిణీ పక్కాగా జరగాలని, ఈ-శ్రమ కార్డుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణం (హౌసింగ్) గ్రౌండింగ్ పనులు వేగంగా చేపట్టాలని, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా ప్రతి కార్యాచరణపై స్పష్టతనిస్తూ, గ్రామాభివృద్ధి పట్ల అధికారుల బాధ్యతను మరింత పెంచేలా ముందడుగు వేశారు. అన్ని పంచాయతీల కార్యదర్శి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ పబ్లిక్ గ్రీవెన్స్ కి 15 ఫిర్యాదులు





**వేపగుంట, పెన్ పవర్, జూలై 28 :** జీవీఎంసీ, జోన్ 8, (పబ్లిక్ గ్రీవెన్స్) ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 ఫిర్యాదులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కె హేమావతి ఆదేశాలు మేరకు గ్రీవెన్స్ ఫిర్యాదులు నిర్ణీత సమయంలో ఎంక్వయిరీ చేసి, నివేదికను అందించాలని అధికారులకు జెడ్సి సూచించారు. నేటి ఫిర్యాదుల్లో ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 7, యుజిడికి 3, రెవెన్యూకి 1, ఈ ఈ 1, వాటర్ సప్లై ఏఈకి 2, ఎలక్ట్రికల్ ఏఈకి 1 వచ్చాయి. ఫిర్యదులను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి, సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ 8 వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల వేదికలో 45 ఫిర్యాదులు స్వీకరణ

### సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు





**అనకాపల్లి, పెన్ పవర్, జూలై 28 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా 45 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో భూ తగాదాలు 30, కుటుంబ కలహాలు 5, మోసాలకు సంబంధించిన ఫిర్యాదు 1, ఇతర విభాగాలకు చెందినవి 4గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి, వాస్తవంగా నిర్ధారించిన వెంటనే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 7 రోజులలోపుగా తగిన విచారణ పూర్తి చేసి, తక్షణ పరిష్కారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే చేపట్టిన చర్యల నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా ముఖాముఖీగా చర్చిస్తూ వారి సమస్యలను శ్రద్ధగా విన్న జిల్లా ఎస్పీ ప్రజలకు వేగంగా న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యతని చెప్పారు. జిల్లా పోలీసులు ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపిస్తూ న్యాయపరంగా పరిష్కరించేందుకు పూర్తి కట్టుబాటుతో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్పై వెంకన్న, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీల్లో 22 కేజీల గంజాయి పట్టివేత

ఇద్దరు ముద్దాయిలను రిమాండ్ కి తరలింపు



**గోపాలపట్నం, పెన్ పవర్, జూలై 28 :** పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో తనిఖీ చేయగా 22 కేజీల గంజాయి పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే గోపాలపట్నం పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడుకు గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నదని సమాచారం అందిన నేపథ్యంలో జూలై 27 ఆదివారం తన సిబ్బందితో కలిసి, నార్త్ సింహాచలం, రైల్వే క్వార్టర్స్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు, 1.రాధికా సేతి, 2 మృత్యులమ్మ హండాల ఇద్దరు వద్ద రెండు సూట్కేసులు ఉండగా, అవి తనిఖీ చేయగా అందులో మొత్తం 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, వెంటనే వారిని అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదాంతరం గోపాలపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్.వి. ప్రభాకర్ కి అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్ కోసం, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు తెలియజేశారు.

## డ్రోన్ కెమెరాలతో బహిరంగ మద్యం సేవించితే గుర్తింపు



- కేసుల నమోదు చేస్తాం
- సీఐ ఎం.వినోద్ బాబు

**చింతపల్లి పెన్ పవర్ జూలై 28 :-** చింతపల్లి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ అల్లర్లు సృష్టించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగంగా మద్యం తాగుతూ, సీసాలు పగలగొట్టి వాతావరణాన్ని కలుషితం చేస్తున్న తాగుబోతులపై డ్రోన్ కెమెరాల సాయంతో గుర్తింపు చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు అసౌకర్యం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై వాహనాలను నిర్దిష్ట ప్రాంతాల్లోనే నిలిపివేయాలని సూచించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

## అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం







**సింహాచలం, పెన్ పవర్, జూలై 28 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# ఢిల్లీకి జగన్.. 'పెద్దల' కోసమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ సోమ, మంగళవారాల్లో ఢిల్లీకి వెళ్లనున్నారా? రాజకీయంగా ఏపీలో జరుగుతున్న పరిణామాలను.. తమ పార్టీ నాయకులపై పెడుతున్న కేసులు.. జైళ్లకు పంపుతున్న వైనాన్ని ఆయన ఢిల్లీ పెద్దలకు వివరించనున్నారా? అంటే.. ఔననే అంటున్నాయి తాడేపల్లి వర్గాలు. ప్రస్తుతం జగన్ బెంగళూరులో ఉన్నారు. అటు నుంచి అటే.. ఆయన ఢిల్లీకి వెళ్తారని.. ఏపీ నుంచి మరో 10 మంది వరకు నాయకులు కూడా ఢిల్లీకి వెళ్లనున్నట్టు చెబుతున్నారు. వీరిలో ముగ్గురు లోక్‌సభ ఎంపీలు.. రాజ్యసభ ఎంపీలు కూడా ఉన్నారని తెలిసింది.ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలోనే.. ఏపీలో కూటమి ప్రభుత్వంపై ఆయన కేంద్రానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. నిజానికి కూటమిలో బీజేపీ కూడా ఉంది. అయినప్పటికీ.. బీజేపీని డామినేట్ చేస్తున్నారని.. అంతా టీడీపీనే చక్కబెడుతోందని.. కూడా.. జగన్ ఫిర్యాదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తద్వారా.. కూటమిలో చిచ్చు పెట్టి.. బీజేపీని దూరం పెట్టాలన్న వ్యూహం కూడా ఉందన్న వాదన ఇటువైపు టీడీపీ నాయకుల నుంచి కూడా వినిపిస్తోంది.

ఇదే విషయాన్ని టీడీపీ సీనియర్లు కూడా సందేహిస్తున్నారు. జగన్ ఏమైనా చేయగలడు! అంటూ.. రాజ మండ్రికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కేంద్రానికి ఉప రాష్ట్రపతి ఎన్నిక కీలకంగా మారింది. ఇది పోటీ లేకుండా జరుగుతుందని అనుకున్నా.. ఇండియా కూటమి తరఫున కాంగ్రె స్ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే రంగంలోకి దిగే అవకాశం ఉంది. దీంతో లోక్‌సభలో ఈ విషయంపై పైచేయి సాధించినా.. రాజ్యసభలో వైసీపీ వంటి తటస్థ పార్టీల అవసరం కేంద్రానికి చాలా అవసరం.ఇది జగన్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మద్యం కుంభకోణంపై జరుగుతున్న విచారణ.. నమోదవుతున్న కేసులు.. ముఖ్యంగా ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు వంటివిషయాలను కేంద్రానికి వివరించ డం ద్వారా.. ఉపశమనం పొందేందుకు జగన్ ప్రయత్నించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రధాని మోడీ కూడా విదేశీ పర్యటన ముగించుకుని ఆదివారం దేశానికి వచ్చారు. సోమవారం నుంచి లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగనుంది. ఇవన్నీ కూడా.. జగన్‌కు కలిసి వచ్చే అవకాశం ఉందని.. అందుకే ఆయన ఢిల్లీ పర్యటన పెట్టుకున్నారని తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి.

# 'ఆపరేషన్ సిందూర్'పై వాడీవేడి చర్చ... రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సైనిక చర్య చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దెబ్బతో పాక్, పీవోకేలోని ఉగ్రస్థావరాలను మట్టుబెట్టింది.. ఉగ్రవాదులను వణికించేసింది. ఈ నేపథ్యంలో... పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడీవేడి చర్చ మొదలైంది. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.అవును... సోమవారం పార్లమెంట్ లో ఆపరేషన్ సిందూర్ పై వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్ నాథ్ సింగ్... ఆపరేషన్ సిందూర్ లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు తెలిపారు. మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయని.. ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపారని.. కేవలం 22 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తి చేశారని తెలిపారు.అనంతరం పాక్ సైన్యం మనపై దాడికి దిగిందని.. ఈ క్రమంలో దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టామని రక్షణ మంత్రి తెలిపారు. మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారని.. ఈ సమయంలో పాక్ లోని మిసైల్ లాంఛింగ్ స్టేషన్ ధ్వంసమైందని.. శత్రువుల దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టిందని.. మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందని తెలిపారు.ఈ సందర్భంగా... సరిహద్దులు దాటి వెళ్లడం.. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదని చెప్పిన రక్షణ మంత్రి... ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఇదే సమయంలో... యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం అని పునరుద్ఘాటించారు.ఈ సమయంలోనే భారత్ దెబ్బకు పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని.. ఈ సందర్భంగా మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారని.. కాల్పుల విరమణకు సంబంధించి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు! ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారని.. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు.

ఇదే సమయంలో భారత్, పాక్ లతో వాణిజ్యాన్ని తగ్గించుకుంటామని తాను బెదిరించడం వల్లే ఆ రెండు దేశాల మధ్య శత్రుత్వాలు ముగిశాయని డొనాల్డ్ ట్రంప్ పదే పదే చేసిన వాదనలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్ ను ఎటువంటి ఒత్తిడితోనూ ఆపలేదని.. లక్ష్యాలు పూర్తిగా సాధించినందుకే దాడులను నిలిపివేసాయని నొక్కి చెప్పారు.

# జమ్మూకశ్మీర్ లో 'ఆపరేషన్ మహదేవ్'.. పహల్గాం దాడి ఉగ్రవాదులు హతం!



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడికి అనంతరం సరిహద్దుల్లో భారత్ అణువణువూ జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానంగా జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో రెగ్యులర్ గా కూంబింగ్ చేపడుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా జమ్మూకశ్మీర్ లో భీకర ఎన్ కౌంటర్ జరుగుతోంది. ఈ ఎన్ కౌంటర్ లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందగా.. వారు పహల్గాం దాడికి పాల్పడినవారని వెల్లడైంది!

అవును... శ్రీనగర్ లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకర స్థాయిలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్ లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు చెబుతుండగా... వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులనే విషయాన్ని సైన్యం ధ్రువీకరించినట్లు ఆల్ ఇండియా రేడియో వెబ్ సైట్ లో వెల్లడించింది.

వాస్తవానికి జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టింది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు సమాచారం రావడంతో సుమారు నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తాజాగా సోమవారం ఉదయం శ్రీనగర్ లోని లిద్వాస్ జనరల్ ఏరియాలోని మౌంట్ మహాదేవ్ సమీపంలో ముగ్గురు విదేశీ ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందింది! ఈ సమయంలో... ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో.. భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు! ఈ సందర్భంగా... మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులని, లష్కరే తయిబాకు చెందినవారని తెలుస్తోంది. ఈ క్రమంలో ఉగ్రవాదుల దాగి ఉన్న ప్రదేశం నుండి అనేక గ్రెనేడ్లు, రేషన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.ఈ క్రమమంలో... ఎన్ కౌంటర్ లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్... జబర్వాన్, మహాదేవ్ శిఖరాల మధ్య జరిగినందున "ఆపరేషన్ మహాదేవ్" అని పేరు పెట్టి ఉండొచ్చని అంటున్నారు.కాగా... ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్ లోని పహల్గాంలో గల బైసరన్ లోయ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడిలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. అనంతరం అక్కడినుంచి సమీపంలోని అటవీప్రాంతం గుండా పరారయ్యారు! అప్పటినుంచి భారత భద్రతా దళాలు ఈ ముష్కరుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. ఈ క్రమంలో... లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ క్రమంలో ఈ మారణహోమానికి పాల్పడిన ఉగ్రమూకలో ఒక్కొక్కరి తలపై రూ.20 లక్షల వరకు రివార్డును ప్రకటించారు.

# బ్యాంకాక్ మార్కెట్ లో సామూహిక కాల్పులు... మృతుల వివరాలివే!



**హైదరాబాద్ పెన్ పవర్:** మానసిక పరిస్థితి బాగోలేకో.. లేక, లక్ష్యాలు వేరే ఉండో తెలియదు కానీ... ఇటీవల కాలంలో సామాన్య ప్రజానికంపై కత్తులతోనూ, తుపాకీలతోనూ విరుచుకుపడుతున్న దుండగుల ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి అమెరికాలోని వాల్ మార్ట్ స్టోర్ లో ఓ దుండగుడు కత్తితో బీభత్సం సృష్టించగా.. తాజాగా బ్యాంకాక్ లో మరో దుండగుడు తుపాకీతో విరుచుకుపడ్డాడు. అవును... శనివారం మిచిగాన్ ట్రావర్స్ సిటీలోని వాల్ మార్ట్ స్టోర్ లో ఓ దుండగుడు కత్తితో బీభత్సం సృష్టించీగా.. ఆ ఘటనలో 11 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో తాజాగా థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ లో ఓ దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకొని.. మృతి చెందాడు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం... బ్యాంకాక్ లోని ఓర్ టు కో మార్కెట్ లోకి ఓ సాయుధుడు చొరబడ్డాడు. ఈ క్రమంలో ఉన్నపలంగా కాల్పులు జరపడం మొదలుపెట్టాడు. ఈ కాల్పుల్లో నలుగురు సెక్యూరిటీ గార్డులు, ఓ మహిళ మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలు గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు చెబుతున్నారు.

అనంతరం.. దుండగుడు తనను తాను కాల్చుకుని చనిపోయాడు. దీంతో... రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా... ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన చతుచక్ మార్కెట్ సమీపంలో ఈ ఘటన జరగడంతో స్థానిక ప్రజలతో పాటు పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ఈ ఘటన స్థానికంగా ఒక్కసారిగా తీవ్ర కలకలం రేపింది. మరోవైపు థాయిలాండ్ – కంబోడియా సరిహద్దుల వద్ద జరుగుతున్న ఘర్షణలతో ఈ ఘటనకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాల్పులు జరిపిన వ్యక్తిని కాంగ్ జిల్లాకు చెందిన 61 ఏళ్ల మాజీ సెక్యూరిటీ గార్డుగా గుర్తించారని సమాచారం.

# టెర్రరిస్టులా చూస్తున్నారు.. కంటతడి పెట్టిన మిథున్ రెడ్డి తల్లి



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తల్లి స్వర్ణలత కంట తడి పెట్టుకున్నారు. రాజమండ్రి జైలులో ఉన్న తన కుమారుడిని చూసిన ఆమె చలించిపోయారు. జైలులో ఎంపీకి ఎలాంటి సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డకు బాగా చూసుకోవాలని జైలు అధికారులను కోరారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మిథున్ రెడ్డితో తల్లి స్వర్ణలత సోమవారం మిలాఖత్ లో కలిశారు. అనంతరం జైలు బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలో ఆమె కంటితడి పెట్టిన వీడియో వైరల్ గా మారింది.

**సౌకర్యాల కోసం వినతి**

లిక్కర్ స్కాంలో అరెస్టు అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిథున్ రెడ్డికి కోర్టు ఆదేశాలతో ఐదు మిలాఖతుల ద్వారా కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు అవకాశం కల్పించారు. అదేవిధంగా రోజూ ఇంటి నుంచి ఆహారం అందివ్వాలని కోర్టు సూచించడంతో మిథున్ రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి రోజూ రాజమండ్రి జైలుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం మిథున్ రెడ్డి తల్లి జైలు వద్దకు వచ్చారు. కొద్దిసేపు ఆయనతో మాట్లాడిన తర్వాత బయటకు వచ్చి మీడియా ఎదుట తన కుమారుడి దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మిథున్ రెడ్డి జైలులో అరకొర సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.

**కన్నీరుపెట్టుకున్న స్వర్ణలత**

జైలులో అదనపు సౌకర్యాల కోసం తమ లాయర్ ద్వారా ప్రయత్నిస్తున్నట్లు స్వర్ణలత చెప్పారు. అయితే తమ వినతిపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సివుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేసమయంలో మిథున్ రెడ్డికి మంచం ఇచ్చారా? లేక కిందే పడుకుంటున్నారా? అంటూ మీడియా ప్రశ్నించగా, తాను ఆ విషయం అడగలేదంటూ ఆమె కన్నీరు పెట్టుకున్నారు. తన కుమారుడు ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జైలు అధికారులు మిథున్ రెడ్డిని బాగా చూసుకోవాలని కోరారు. ఆయనను టెర్రరిస్టు మాదిరిగా చూడొద్దని ప్రాధేయపడ్డారు.

**తిరుపతి నుంచి రాజమండ్రికి..**

దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న పెద్దిరెడ్డి కుటుంబం లిక్కర్ స్కాం కారణంగా తొలిసారి ఇలా రోడ్డుపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమకాలీకుడుగా రాజకీయాలు చేస్తున్న సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ప్రభుత్వంలో కీలక నేతగా పనిచేశారు. ప్రధానంగా ఆయన కనుసన్నల్లో రాయలసీమ రాజకీయాలు కొనసాగాయి. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి జగన్ కు అత్యంత సన్నిహితుడైన మిథున్ రెడ్డి పార్టీలో ప్రధాన నేతగా ఎదిగారు. ఉభయ గోదావరి జిల్లాల వ్యవహారాలతోపాటు ఢిల్లీ స్థాయిలో పార్టీ వ్యవహారాలను చక్కబెట్టేవారు. అలాంటి నేతను అరెస్టు చేసి జైలులో వేయడంతో వైసీపీ శ్రేణులు కంగుతిన్నాయి. ఈ పరిణామాన్ని ఊహించని పెద్దిరెడ్డి కుటుంబం తిరుపతి నుంచి రాజమండ్రి తరలివచ్చి మిథున్ రెడ్డి యోగక్షేమాలను పర్యవేక్షిస్తోంది. జైలులో మిథున్ రెడ్డి ఉండగా, ఆయన కుటుంబ సభ్యులు జైలు బయట పడిగాపులు కాస్తున్నారు. వారిని పరామర్శించేందుకు వైసీపీ నేతలు పెద్ద సంఖ్యలో రాజమండ్రి తరలివస్తున్నారు.

# చంద్రబాబు వల్లే సింగపూర్‌లో ఉన్నా.. ఏపీకి రోల్స్ రాయిస్ తెస్తా..



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది. వన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన తెలుగు డయాస్పోరా సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో సింగపూర్‌తో సహా పక్కనే ఉన్న మరో ఐదు దేశాల నుంచి ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఊహకుమించిన స్థాయిలో తెలుగు వారు రాకతో ఆడిటోరియం నిండిపోయింది. తెలుగు ప్రజల ఆనందం, సంతోషాల నడుమ సుమారు ఐదు గంటల పాటు పండుగలా డయాస్పోరా కార్యక్రమం వీడియోలు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ సందర్భంగా ఓ తెలుగు మహిళా టెకీతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

**బాబు విజన్ తో సింగపూర్ వచ్చా..**

4వ సారి ముఖ్యమంత్రిగా విజయం సాధించిన తర్వాత తొలిసారి సింగపూర్‌కు సీఎం చంద్రబాబు వస్తున్నారన్న సమాచారంతో భార్యా పిల్లలు, స్నేహితులతో కలిసి ఎన్ఆర్ఐలు డయాస్పోరాకు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. అనంతరం వారి అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రోల్స్ రాయిస్ కంపెనీలో ఏఐ హెడ్ గా పనిచేస్తున్న ఓ మహిళ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే తాము ఈ రోజు ఈ స్థితికి వచ్చామని ఆనందంగా వెల్లడించారు. దీంతో సభలో అంతా చప్పట్లు కొట్టి హర్షం ప్రకటించారు.

**ఏపీకి రోల్స్ రాయిస్ కంపెనీ తీసుకువస్తా..**

తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి వచ్చిన ఆ మహిళా టెకీ చంద్రబాబు పనితీరుపై అభినందనలు తెలిపారు. గతంలో ఆయన ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాల వల్లే తనలాంటి టెకీలు ప్రపంచ ప్రతిష్టాత్మక కంపెనీల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తన కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హర్షం ప్రకటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు ఏపీ అభివృద్ధికి చేదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. అదేసమయంలో పేదరిక నిర్మూలన కోసం తాను ప్రవేశపెట్టిన పీ-4 పథకంలో చేరి తోటివారికి సహాయం చేయాలని ఆ మహిళా ఉద్యోగిని కోరారు. దీనికి ఆమె అంగీకరిస్తున్నట్లు తెలపడం విశేషం. ఇలా సింగపూర్ లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశం మంచి ఫలితాలను ఇచ్చిందని ప్రభుత్వ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రపంచ ప్రఖ్యాత షావోలిన్ టెంపుల్ అధినేత తప్పుడు పనులు



షావోలిన్ టెంపుల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. "మార్షల్ ఆర్ట్స్" అన్న మాట తెలిసిన ప్రతి ఒక్కరికి షావోలిన్ టెంపుల్ గురించి తెలిసి ఉండటమే కాదు.. తమ జీవితకాలంలో ఒక్కసారైనా అక్కడకు వెళ్లాలని అనుకోవటం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత మార్షల్ ఆర్ట్స్ లో ఒకటైన కుంగ్ ఫూ కు పుట్టినిల్లుగా.. దాని శిక్షణకు అంతకు మించిన ప్రదేశం మరొకటి లేదన్న పేరు ప్రఖ్యాతులు షావోలిన్ సొంతం.చైనాలోని హెనాన్ ప్రావిన్సులో ఉండే షావోలిన్ టెంపుల్ ను క్రీస్తు శకం 495లో స్థాపించారు. సాంగ్ పర్వత దిగువన ఈ ప్రసిద్ధ క్షేత్రం ఉంది. 1500 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టెంపుల్ కు చారిత్రక ప్రాధాన్యత మాత్రమే కాదు.. అంతకు మించిన మతపరమైన ప్రాముఖ్యత ఉంది. మార్షల్ ఆర్ట్స్ కు ఎంతో ఫేమస్ అయిన ఈ టెంపుల్ కు.. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ఇక్కడకు వచ్చి కుంగ్ ఫూ శిక్షణ తీసుకుంటూ ఉంటారు. పర్యాటకంగానూ ఎంతో ప్రాచుర్యం పొందిన షావోలిన్ టెంపుల్ కు అధినేతగా ఉండే గురువు తప్పుడు పనులు తాజాగా తెర మీదకు వచ్చి సంచలనంగా మారాయి.

షావోలిన్ టెంపుల్ కు అధిపతిగా వ్యవహరిస్తున్న షి యోంగ్సిన్ వ్యవహారశైలిపై పలు తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా రోజులుగా అనేక మంది మహిళలతో లైంగిక సంబంధాలు మాత్రమే కాదు.. అక్రమంగా ఒక చిన్నారికి తండ్రి అయినట్లుగా గుర్తించిన వైనం కలకలాన్ని రేపుతోంది. అతడు చేసిన పనులన్నీ బౌద్ధ సూత్రాల్ని ఉల్లంఘించినట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అతడ్ని పలు విభాగాల అధికారులు విచారిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాల్ని త్వరలో షేర్ చేస్తామని చెబుతున్నారు. నిధుల దుర్వినియోగంతో పాటు.. అక్రమంగా ఆస్తుల్ని కూడబెట్టటం.. పలువురు మహిళలతో లైంగిక సంబంధాలు కలిగి ఉన్న వైనం తీవ్ర కలకలానికి కారణంగా మారింది. చైనాలోని ప్రసిద్ధ బౌద్ధ సన్యాసుల్లో ఒకరుగా గుర్తింపు పొందిన ఇతగాడి మీద గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నట్లుగా చెబుతున్నారు

1999లో సావోలిన్ టెంపుల్ కు అధిపతిగా నియమితులైన అతడు.. ఆ ప్రాంతాన్ని డెవలప్ చేయటంతో అతడ్ని సీఈవో మాంక్ గా పేర్కొనేవారు. ఎంబీఏ బ్యాక్ గ్రౌండ్ ఉన్న అతను.. ఆస్ట్రేలియాలో కోట్లాది రూపాయిలు విలువ చేసే ఆలయాన్ని.. ఒక హొటల్ ను.. కుంగ్ ఫూ అకాడమీతో పాటు.. గోల్ఫ్ కోర్స్ నిర్మించాలన్న ప్రణాళిక వివాదాస్పదంగా మారిన వైనం తెలిసిందే. ఎంతో గౌరవ స్థానంలో ఉన్న బౌద్ధ గురువు ఇలాంటి తప్పుడు పనులు చేయటం.. అవన్నీ బయటకు రావటం ఇప్పుడు షాకింగ్ గా మారింది.

## షటిల్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి..

ఇటీవల కాలంలో డాన్స్ చేస్తూ, క్రికెట్ ఆడుతూ, కుర్చీలో కూర్చుని సేదతీరుతూ కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై చాలా మంది వ్యక్తులు మృతి చెందిన ఘటనలు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అందుకు కారణం కరోనా వైరస్ అనే చర్చా నడిచింది. ఇటీవల దీనిపై ఐ.సీ.ఎం.ఆర్ క్లారిటీ ఇచ్చింది. ఈ క్రమంలో షటిల్ ఆడుతూ 25 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన షాకింగ్ ఘటన తెరపైకి వచ్చింది. అవును... ఇటీవల కాలంలో ప్రధానంగా యువకులు ఉన్నపలంగా గుండె పోటుతో మృతి చెందుతున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా హైదరాబాద్ లో అలాంటి ఒక సంఘటన జరిగింది. ఇందులో భాగంగా... 25 ఏళ్ల ఆరోగ్యవంతమైన వ్యక్తి.. కాక్ తీసుకోవడానికి వంగిన కొన్ని క్షణాల తర్వాత అకస్మాత్తుగా కోర్టులో కుప్పకూలిపోయాడు.వివరాల్లోకి వెళ్తే... తాజాగా హైదరాబాద్ లోని నాగోల్ ప్రాంతంలోగల ఒక ప్రైవేట్ షటిల్ కోర్టులో ఆడుతున్నాడు గుండ్ల రాకేష్ (25) అనే వ్యక్తి. అతడు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అతడు షటిల్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.దీంతో... సహచరులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడిని ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ డిప్యూటీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడుగా గుర్తించారని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన భయానక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

ఈ సమయంలో... యువకుడిగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఆకస్మిక మరణం.. ఆటలు ఆడటం, జిమ్ చేయడం వంటి శారీరక శ్రమల సమయంలో యువతలో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందనే ఆందోళన మరోసారి మొదలైంది. దీంతో... గుండె జబ్బుల లక్షణాలు ముందస్తుగా గుర్తించడంతోపాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కాగా... కోవిడ్ తర్వాత దేశంలో ఆకస్మిక మరణాలు.. ప్రధానంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్ తో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరిగిన సంగతి తెలిసిందే! దీనికంతటికీ కరోనా వ్యాక్సినే కారణమనే ప్రచారం జరిగింది.

# చాట్ జీపీటీ వెర్షన్ : చంద్రబాబు VS కేసీఆర్ VS జగన్.. ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?



తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రంలో చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ముగ్గురు నాయకులు తమదైన శైలిలో పాలనను నడిపిస్తున్నారు. అయితే, యువత భవిష్యత్తుకు ఎవరు మెరుగైన దారి వేస్తున్నారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నేటి ప్రపంచం కేవలం రోడ్లు, పెన్షన్లు, రేషన్లతో సరిపుచ్చుకునేది కాదు. కృత్రిమ మేధస్సు (%ూ×%), ఆటోమేషన్, డిజిటల్ ఇన్నొవేషన్‌లు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాయి. దేశం ముందుకు వెళ్లాలంటే యువతను గ్లోబల్ స్కిల్స్‌తో సిద్ధం చేయడం అత్యవసరం. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు నాయకుల విధానాలను చాట్ జీపీటీ విశ్లేషించింది. . అభివృద్ధి, సంక్షేమం, ఐటీ, విద్య వంటి రంగాల్లో వారి విధానాలు భిన్నంగా ఉన్నా, 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడంలో ఎవరి విజన్ ఎంతవరకు ఉందని ఏఐ 'చాట్ జీపీటీ'ని ప్రశ్నించగా అది ఆసక్తికర సమాధానాన్ని విశ్లేషణను అందించింది. చాట్ జీపీటీ విశ్లేషణ ఎలా ఉందో తెలుసుకుందాం.

**చంద్రబాబు నాయుడు.. విజన్ విత్ టెక్నాలజీ**

చంద్రబాబు నాయుడుకు టెక్నాలజీ పట్ల ఉన్న విజన్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చిన ఘనత ఆయనకు దక్కుతుంది. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయి. %ూ×% స్కిలింగ్ సెంటర్లు, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నాలు తిరిగి ఊపందుకున్నాయి. విదేశాల్లో ఉన్న తెలుగు యువత, ఇంజనీర్లు మాత్రం "బాబు వద్దే గ్లోబల్ దృష్టికోణం ఉంది" అని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తు అవసరాలను ముందుగానే గుర్తించి, దానికి తగ్గ ప్రణాళికలు రచించడంలో చంద్రబాబుకు ఉన్న పట్టు యువతకు అనుకూలంగా మారుతుందన్నది చాట్ జీపీటీ వాదన.

**కేసీఆర్.. స్టార్టప్‌లు, ఐటీ, మెట్రో గ్లామర్**

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లోని ఐటీ, స్టార్టప్ రంగాలు విస్తృతంగా వృద్ధి చెందాయి. టీ-హబ్ , టాస్క్, %ూ×% మిషన్ తెలంగాణ వంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. అమెరికా, యూరప్‌లోని టెక్ కంపెనీలు హైదరాబాద్‌ను తమ పెట్టుబడులకు ఎంపిక చేసుకోవడం కేవలం యాదృచ్ఛికం కాదు, ఇది పాలనలో తీసుకున్న గణనీయమైన నిర్ణయాల ఫలితం. అయితే, ఈ వృద్ధి ఎక్కువగా పట్టణ కేంద్రాలకే పరిమితమవుతోందన్న విమర్శ ఉంది. గ్రామీణ యువతకు మాత్రం ఈ ప్రయోజనాలు తక్కువగానే కనిపిస్తున్నాయని చాట్ జీపీటీ ఆందోళన వ్యక్తం చేసింది.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఐటీ రంగంలో వృద్ధి అసమానతలు తెలంగాణలో ఒక సవాలుగా నిలుస్తున్నాయని చాట్ జీపీటీ తెలిపింది..

**జగన్ మోహన్ రెడ్డి.. సంక్షేమంపైనే ఫోకస్, స్కిల్స్‌కు గ్యాప్**

జగన్ పాలనలో వైఎస్సార్ చేయూత, వాలంటీర్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలు గ్రామీణ, పేద ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. విద్యను ఉచితంగా అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి ప్రయత్నాలు ప్రశంసనీయం. అయితే, డిజిటల్ జాబ్స్, టెక్ స్కిల్స్, ఇన్నొవేషన్ ఎకోసిస్టంపై దృష్టి సారించడంలో కొంత వెనుకబడి ఉన్నారని చాట్ జీపీటీ అభిప్రాయపడింది. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, ఐటీ ఉద్యోగాల్లో అవకాశం లేని స్థితిలో ఉన్నారనే ఆందోళన జగన్ పాలనలో వ్యక్తమైంది. సంక్షేమం ముఖ్యమైనదే అయినా, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై మరింత దృష్టి సారించాలనేది చాట్ జీపీటీ కోరిక.

**ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?**

చంద్రబాబు: భవిష్యత్తు అవసరాలను ముందే అర్థం చేసుకుని, AI, ఫిన్ టెక్, డిజిటల్ స్కిల్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టే నాయకుడు.

**కేసీఆర్ / కేటీఆర్:** ఇప్పటికే హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ నెట్‌వర్క్‌లో స్థిరం చేసిన నాయకత్వం.

**జగన్:** పేదలకు విద్య, సంక్షేమం అందించినా, టెక్-ఫోకస్, నైపుణ్యాల పెంపుదలలో వెనుకబడిన పాలన.

ఈ మూడు అభిప్రాయాలను చాట్ జీపీటీ క్లుప్తంగా వ్యక్తపరిచింది.

చాట్ జీపీటీ ఎన్ని వివరణలు, విశ్లేషణలు ఇచ్చినా కూడా.. పాలకులు ఎవరనేది ముఖ్యం కాదు, వారి విజన్, దాని అమలు తీరు, యువతకు అందే ప్రత్యక్ష ప్రయోజనం ఎంత అన్నదే అసలైన విషయం. అసెంబ్లీలో ఎవరు పెద్దగా అరిచారనే దానికంటే, యువతను ఎవరు నిశ్శబ్దంగా భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారో మనం గమనించాలి. AI, డిజిటలైజేషన్, గ్లోబల్ మార్కెట్లు... ఇవన్నీ కొత్త శక్తులుగా మారుతున్న ఈ కాలంలో పాలకుడు ముందుచూపుతో ఉండాలి, దానిని సమర్థవంతంగా అమలు చేయగలగాలి . ఇప్పుడు యువత అడగాల్సిన ప్రశ్న "నా భవిష్యత్తు కోసం నా ఈ రోజు ఎవరు సిద్ధం చేస్తున్నారు?" అని.. ఈ ప్రశ్నకు సమాధానం దొరికితేనే తెలుగు రాష్ట్రాల యువత నిజమైన పురోగతిని సాధించగలదు.

# జగన్ దూకుడు.. గవర్నర్ తో కీలక భేటీ, ఎందుకంటే..?



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచారు. లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలు, గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులను ప్రభుత్వ ఆదేశాలతో సిట్ అరెస్టు చేస్తున్న వేళ ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. వైసీపీ కీలక నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు తర్వాత నెక్స్ ముఖ్య నేత అరెస్టు అన్న ప్రచారం జరుగుతున్న సమయంలో మాజీ సీఎం జగన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో సమావేశం కానుండటం ఆసక్తికరంగా మారింది. మద్యం కేసులో మాజీ సీఎం జగన్ కు కిక్ బ్యాక్ అందిందని ఆరోపిస్తూ సిట్ అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ పరిస్థితుల్లో గవర్నరుతో జగన్ భేటీ కానుండటం ఉత్కంఠ రేపుతోంది.

**ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకే..**

మద్యం స్కాంపై చార్జిషీటులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేరు ప్రస్తావించడంతో ఆయనను అరెస్టు చేస్తారా? అన్న చర్చ మొదలైంది. అయితే మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ను అరెస్టు చేయాలంటే తప్పనిసరిగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సివుంది. మరోవైపు లిక్కర్ స్కాంలో తొలి చార్జిషీటు దాఖలు చేసిన సిట్ అనుబంధ చార్జిషీటు దాఖలకు మూడు వారాల సమయం కోరింది. ఈ నేపథ్యంలో మరో వారం పది రోజుల్లో ఈ గడువు ముగియనుంది. అంటే జగన్ విషయంలో గవర్నర్ నిర్ణయం కీలకంగా మారే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. దీంతో గవర్నర్ తో భేటీ కావాలని మాజీ సీఎం జగన్ నిర్ణయించడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

**గవర్నర్ తో భేటీ ఎందుకు?**

లిక్కర్ స్కాంపై చురుగ్గా దర్యాప్తు జరుగుతున్న సమయంలో మాజీ సీఎం జగన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో ఎందుకు భేటీ అవ్వాలని అనుకుంటున్నారన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. తన అరెస్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరనున్నారా? లేక ఇంకేమైనా ఉందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అయితే వైసీపీ నేతలనే టార్గెట్ గా చేసుకుని ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేస్తుందన్న విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లేందుకే మాజీ సీఎం గవర్నర్ తో భేటీకి సమయం కోరినట్లు చెబుతున్నారు. గవర్నర్ అపాయింట్‌మెంట్ లభించడంతో ప్రస్తుతం బెంగళూరులో ఉన్న మాజీ సీఎం తాడేపల్లి వచ్చారని అంటున్నారు. ప్రభుత్వం నమోదు చేస్తున్న కేసులతోపాటు తన జిల్లాల పర్యటనపై విధిస్తున్న ఆంక్షలపై కూడా గవర్నర్ కు ఫిర్యాదు చేయనున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

**వరుస కార్యక్రమాలు**

బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చిన జగన్ రానున్న మూడు నాలుగు రోజులు పూర్తి బిజీగా గడపనున్నారు. ఈ రోజు సాయంత్రం గవర్నర్ తో భేటీ జరగనుండగా, రేపు ఉదయం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పీఏసీతో సమావేశం నిర్వహించనున్నారు. వచ్చే నెలలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే పరిస్థితి ఉందన్న అంచనాతో ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే ఎలా స్పందించాలన్న అంశంపై వైసీపీ అధినేత పీఏసీ దిశానిర్దేశం చేయనున్నారని అంటున్నారు. ఇప్పటికే అరెస్టు అయిన వారిని కేసుల నుంచి బయట పడేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు క్షేత్రస్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలపైనా అధినేత సూచనలు చేయనున్నారని అంటున్నారు. ఇక వివిధ ఆరోపణలతో అరెస్టు అయి ప్రస్తుతం రిమాండు ఖైదీలుగా జైలులో ఉన్న రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించేందుకు మాజీ సీఎం రాజమండ్రి, నెల్లూరులో పర్యటించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

ఈ నెల 31న నెల్లూరు వెళ్లి అక్కడి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణితో ములాఖత్ అవ్వాలని మాజీ సీఎం జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా వచ్చేనెల 5న రాజమండ్రిలో ఎంపీ మిథున్ రెడ్డితో భేటీ కావాలని భావిస్తున్నారు. అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు అయిన కాకాణిని ఇంతకుముందే జగన్ పరామర్శించాల్సివుంది. అయితే అప్పట్లో జగన్ హెలిప్యాడ్ కోసం వైసీపీ అడిగిన చోట కాకుండా, మరో చోట స్థలం చూపడంతో ఆ పర్యటన వివాదాస్పదమైంది. దీంతో ఆయన నెల్లూరు పర్యటనను గతంలో రద్దు చేసుకున్నారు. అయితే కాకాణి ఇంకా జైలులో ఉండటం, ఈ కేసులో మరో మంత్రి అనిల్ కుమార్ ను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయనే ప్రచారంతో జగన్ తన నిర్ణయం మార్చుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ కాకాణితో ములాఖత్ అవ్వాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. ఈ పర్యటనలోనే టీడీపీ కార్యకర్తలు దాడితో ధ్వంసమైన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిని పరిశీలించి ఆయనను పరామర్శిస్తారని చెబుతున్నారు.

# రాజ్ నాథ్ వర్సెస్ గగోయ్... 'ఆపరేషన్ సిందూర్' పై హాట్ హాట్ కామెంట్స్!



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' పై సోమవారం లోక్ సభలో చర్చ మొదలైంది. ఈ సందర్భంగా... ఆపరేషన్ సింధూర్ చేపట్టడం, అది సాధించిన వీజయం, ఆ తర్వాత పాక్ సైనిక చర్య, సడన్ గా సీజ్ ఫైర్.. పై రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ నేపథ్యంలో... కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్.. కేంద్రం తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు.

అవును... పార్లమెంటులో నేడు ఆపరేషన్ సిందూర్ పై వాడీ వేడీ చర్చ మొదలైంది. ఈ సందర్భంగా మాట్లాడిన రాజనాథ్ సింగ్... ఆపరేషన్ సిందూర్ కి సంబంధించిన విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా... గతంలో జరిగిన యూరీ, పుల్వామా దాడుల తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద మౌలిక సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపైనే కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ స్పందిస్తూ కీలక ప్రశ్నలు సంధించారు.ఇందులో భాగంగా... యూరీ, పుల్వామా దాడుల తర్వాత సరిహద్దుల్లో తీవ్రవాద మౌలిక సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేస్తే... పహల్గాంలో తీవ్రవాదులు ఎక్కడి నుంచి వచ్చారని గౌరవ్ నిలదీశారు. ఇదే సమయంలో... పాకిస్తాన్ పై యుద్ధం చేయాలని తాము అనుకోవడం లేదని, యుద్ధం తమ లక్ష్యం కాదని రాజ్ నాథ్ సింగ్ చెప్పగా.. పాక్ పై యుద్ధం చేయాలని ఎందుకు అనుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇలా ఓవైపు ఉగ్రవాద మౌలిక సదుపాయాలు కూల్చేశామని చెప్పుకుంటూనే.. మరోవైపు ఉగ్రవాద దాడి మళ్ళీ జరగవచ్చని చెప్తున్నారని.. అదే జరిగితే అప్పుడు పాక్ పని పడతామనని అంటున్నారని గగోయ్ ఆక్షేపించారు. గతంలో పుల్వామా దాడి జరిగినప్పుడు కూడా పాకిస్తాన్ లోకి చొరబడి కొడతామని ప్రధాని మోడీ చెప్పారని, ఇప్పుడు పహల్గాం దాడి తర్వాత కూడా అదే చెప్తున్నారని ఎద్దేవా చేశారు. పాక్ మళ్ళీ దాడి చేస్తే స్పందిస్తామని చెప్పడం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు!

ఇదే సమయంలో... పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచినా.. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయిందని గుర్తు చేసిన గగోయ్ గౌరవ్... బైసరన్ లోయలోని మారణకాండకు పాల్పడిన తర్వాత ఉగ్రవాదులు కొందరి సహకారంతో పరారయ్యారని.. ఆ సమయంలో వారికి మద్దతిచ్చిన వారి గురించి సర్కారు వద్ద సమాధానం లేదని అన్నారు.

ఇదే క్రమంలో... శాటిలైట్ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ ఇంత ఉన్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదులను పట్టుకోలేకపోయారని కాంగ్రెస్ ఎంపీ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలో... ఆర్టికల్ 370 ఎత్తివేసిన తర్వాత జమ్ముకశ్మీర్ సురక్షితంగా మారిందని.. ప్రభుత్వ హామీతో జమ్ముకశ్మీర్ కు పర్యాటకుల తాకిడి మొదలైందని.. అంతలోగా ఈ దారుణం చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు.కాగా... అంతక ముందు మాట్లాడిన రక్షణ్మంత్రి రాజ్ నాథ్ సింగ్... సరిహద్దులు దాటి వెళ్లడం ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదని.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో... యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం అని పునరుద్ఘాటించారు.ఈ సమయంలోనే భారత్ దెబ్బకు పాక్ కాళ్ల బేరానికి వచ్చిందని.. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారని.. కాల్పుల విరమణపై వివరణ ఇచ్చారు. ఇదే సమయంలో భారత్, పాక్ లతో వాణిజ్యాన్ని తగ్గించుకుంటామని తాను బెదిరించడం వల్లే ఆ రెండు దేశాల మధ్య శత్రుత్వాలు ముగిశాయని డొనాల్డ్ ట్రంప్ పదే పదే చేసిన వాదనలను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తోసిపుచ్చారు.ఆపరేషన్ సిందూర్ ను ఎటువంటి ఒత్తిడితోనూ ఆపలేదని.. లక్ష్యాలు పూర్తిగా సాధించినందుకే దాడులను నిలిపివేసాయని నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు తెలిపారు.

## నేనే టీమిండియా కెప్టెన్ అయితే అలా చేసేవాడిని: ఇంగ్లాండ్‌కు అశ్విన్ కౌంటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ మధ్య ఆదివారం (జూలై 27) ముగిసిన నాలుగో టెస్ట్ లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఐదో రోజు ఆటలో భాగంగా ఇరు జట్ల మధ్య చిన్న వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదో రోజు ఆట మరో 15 ఓవర్లు ఉండగా ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ డ్రా చేసుకోవాలని జడేజా దగ్గరకు వచ్చి షేక్ హ్యాండ్ ఇవ్వాలని చూశాడు. అయితే అప్పటికే సుందర్, జడేజా ఇద్దరూ కూడా సెంచరీలకు దగ్గరలో ఉండడంతో మన జట్టు డ్రా కు అంగీకరించలేదు. దీంతో కాసేపు గ్రౌండ్ లో హై డ్రామా చోటు చేసుకుంది. ఈ సమయంలో స్టోక్స్ మ్యాచ్ డ్రా కోసం షేక్ హ్యాండ్ కోరుతూ జడేజా దగ్గరుకు వెళ్ళాడు. అయితే జడేజా అప్పుడు 89 పరుగులు వద్ద ఉంటే.. సుందర్ 80 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. ఇద్దరూ కూడా సెంచరీలు దగ్గరలో ఉండడంతో జడేజా, సుందర్ స్టోక్స్ కు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి నిరాకరించారు. క్రీడా స్ఫూర్తి మరచి భారత ఆటగాళ్లను తక్కువ చేసి మాట్లాడినందుకు ఇంగ్లాండ్ ఆటగాళ్లపై విమర్శల వర్షం కురుస్తుంది. ఈ సంఘటనపై తాజాగా టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ స్పందించాడు. ఇంగ్లాండ్ జట్టుపై కౌంటర్ విసిరి తనదైన శైలిలో సెటైర్ వేశాడు.

తన యూట్యూబ్ ఛానల్ లోని ఒక వీడియోలో అశ్విన్ కోపంగా మాట్లాడుతూ..” రూల్ ప్రకారం మ్యాచ్ లో ఫలితం రాదని ఇద్దరు కెప్టెన్లు భావిస్తే వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకొని మ్యాచ్ ను డ్రాగా ప్రకటించవచ్చు. ఇక్కడ స్టోక్స్‌కు రెండు కారణాలు ఉన్నాయి. అతను తన బౌలర్లను అలసిపోవాలని కోరుకోలేదు.

దానితో పాటు వికెట్లు పడలేదనే నిరాశలో ఉన్నాడు. దీంతో ప్రత్యర్థి జట్టు కూడా సంతోషంగా ఉండాలని కోరుకోలేదు. నేను భారత కెప్టెన్‌ను అయితే, మిగిలిన 15 ఓవర్లు ఆడమని చెప్పేవాడిని. ఇంగ్లాండ్‌కు నా ప్రశ్న ఏమిటంటే, మీరు క్రికెట్ స్ఫూర్తికి బ్రాండ్ అంబాసిడర్ అయితే, హ్యారీ బ్రూక్‌ను 15 ఓవర్ల బౌలింగ్ ఇచ్చి ఉండాల్సింది”. అని అశ్విన్ అన్నాడు.

## టీమిండియాతో ఐదో టెస్టు.. స్క్వాడ్ ప్రకటించిన ఇంగ్లాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి నాలుగు టెస్టులు ఐదో రోజు చివరి సెషన్ వరకు వెళ్లడం విశేషం. లీడ్స్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ లో ఇంగ్లాండ్ గెలిస్తే.. ఎడ్జ్ బాస్టన్ లో జరిగిన రెండో టెస్టులో ఇండియా భారీ విజయాన్ని అందుకుంది. లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ గెలిచి సిరీస్ లో 2-1 తో ఆధిక్యంలోకి వెళ్ళింది. ఇటీవలే ముగిసిన మాంచెస్టర్ టెస్ట్ డ్రా గా ముగిసింది. ఈ సిరీస్ లో జరగబోయే చివరి టెస్ట్ కోసం ఇరు జట్లు కసరత్తులు చేస్తున్నాయి. టీమిండియాతో జరగబోయే చివరిదైన ఐదో టెస్ట్ కు ఇంగ్లాండ్ తమ స్క్వాడ్ ను ప్రకటించింది.ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (%జుజదీ%) సోమవారం (జూలై 28) 15 మంది ఆటగాళ్లతో కూడిన ఇంగ్లాండ్ జట్టును ప్రకటించింది. మొత్తం 15 మందితో కూడిన స్క్వాడ్ లో కొత్తగా ఫాస్ట్ బౌలర్ జెమీ ఓవర్ టన్ ను అదనంగా చేర్చుకుంది. ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదో టెస్టు ఈ నెల 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది. ప్రస్తుతం 4 టెస్ట్ మ్యాచ్ లు జరగగా ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. చివరి టెస్టులో ఇంగ్లాండ్ గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది. మరోవైపు ఇండియా విజయం సాధిస్తే సిరీస్ సమం అవుతోంది. ఒకవేళ ఈ మ్యాచ్ డ్రా అయితే 2-1 తేడాతో ఇంగ్లాండ్ సిరీస్ గెలుచుకుంటుంది.



**టీమిండియాతో 5వ టెస్ట్ కు ఇంగ్లాండ్ స్క్వాడ్:**
బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడాన్ కార్స్, జాక్ క్రాలే, లియామ్ డాసన్, బెన్ డకెట్, ఓల్లీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్ కీపర్), జోష్ టంగ్, క్రిస్ వోక్స్, జెమీ ఓవర్ టన్.

## ఆట చివర్లో బ్రూక్ తో బౌలింగ్ చేయించడంపై స్టోక్స్ వివరణ



- డ్రాగా ముగిసిన ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్టు
- అద్భుత పోరాటం కనబర్చిన టీమిండియా
- చివర్లో నిర్లక్ష్యంగా బంతులు విసిరిన బ్రూక్
- టీమిండియా అభిమానుల ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** టెస్టు క్రికెట్ చరిత్రలోనే అద్భుత పోరాటం అనదగ్గ రీతిలో ఓల్డ్ ట్రాఫర్డ్ లో టీమిండియా ఆటగాళ్లు అద్వితీయమైన స్ఫూర్తి కనబర్చారు. తద్వారా, ఓటమి తప్పదనుకున్న టెస్టును డ్రాగా ముగించి, సిరీస్ సమం చేసే ఆశలను సజీవంగా నిలుపుకున్నారు. అయితే, నిన్న ఐదో రోజు ఆట చివర్లో టీమిండియా బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీలకు చేరువలో ఉండగా... ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తమ ప్రధాన బౌలర్లను పక్కనబెట్టి హ్యారీ బ్రూక్ ను బౌలింగ్ కు దించడం విమర్శలకు దారితీసింది. దీనిపై స్టోక్స్ వివరణ ఇచ్చాడు. తమ జట్టుకు గెలుపు అవకాశాలు కనిపించినంత వరకు ప్రధాన బౌలర్లతోనే ఓవర్లు వేయించామని, ఇక డ్రా తప్పదని తేలినప్పుడు వారిపై ఇంకా భారం మోపడం సరికాదనిపించిందని అన్నాడు. అందుకే, పార్ట్ టైమ్ బౌలర్ బ్రూక్ కు బంతి ఇచ్చానని తెలిపాడు. ఇక, మ్యాచ్ ముగిసేందుకు మరో గంట సమయం ఉన్నప్పటికీ... జడేజా, సుందర్ లకు తాను షేక్ హ్యాండ్ ఇచ్చే ప్రయత్నాన్ని కూడా స్టోక్స్ సమర్థించుకున్నాడు. ఇక మ్యాచ్ లో ఫలితం తేలే అవకాశం లేనప్పుడు డ్రా ప్రతిపాదనతో షేక్ హ్యాండ్ ఇవ్వడం సాధారణమైన విషయం అని అన్నాడు. కానీ తన ప్రతిపాదనకు అంగీకరించలేదని, దాంతో, తమ మెయిన్ బౌలర్లకు విశ్రాంతి ఇచ్చి బ్రూక్ తో బౌలింగ్ చేయించానని వివరించాడు. అయితే, బ్రూక్ ఎంతో నిర్లక్ష్యంగా స్లో ఫుల్ టాస్ లు వేయడం, కొట్టుకోండి అన్నట్టు బౌలింగ్ చేయడం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. దీనిపైనా స్టోక్స్ స్పందించాడు. బౌలింగ్ చేసేటప్పుడు చెత్త పనులు చేయొద్దు... కొత్తగా ఏమీ ట్రై చేయాల్సిన అవసరం లేదు అని బ్రూక్ కు చెప్పానని వెల్లడించాడు.

# ప్యారడైజ్ దసరా గిఫ్ట్ కోసమే..?





కొచ్చి ఐలాండ్ లైఫ్‌కి మాళవిక మోహనన్ హృదయపూర్వ క నివాళి



హీర్ అచ్రా: చిక్ స్టైల్‌తో అప్రయత్నంగా ప్రకాశిస్తుంది

న్యాచురల్ స్టార్ నాని ప్యారడైజ్ పనుల్లో బిజీగా ఉన్నాడు. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా మిగతా కాస్టింగ్ ఎవరన్నది ఇంకా వెల్లడించలేదు. దసరా నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్యారడైజ్ ఫస్ట్ స్టేట్మెంట్ తోనే నాని సర్ ప్రైజ్ చేశాడు. తన రా అండ్ మాస్ స్టేట్మెంట్ తో సినిమా రేంజ్ ఏంటన్నది చూపించాడు నాని. ఐతే ఫస్ట్ టీజర్ అదిరిపోగా సినిమాపై అంచనాలు కూడా భారీగా పెంచింది.

**దసరాకి ప్యారడైజ్ అప్డేట్..**

ఐతే ప్యారడైజ్ సినిమా రెండో టీజర్ ఎప్పుడని ఫ్యాన్స్ అడుగుతున్నారు. దసరాకి ప్యారడైజ్ నుంచి ఏదైనా అప్డేట్ ఉండొచ్చా అనే చర్చ నడుస్తుంది. సినిమాను నెక్స్ట్ మార్చి రిలీజ్ లాక్ చేశాడు నాని. ఎట్టి పరిస్థితుల్లో అనుకున్న డేట్ కి సినిమా వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. నాని ప్యారడైజ్ లో కథానాయిక ఎవరన్నది ఇంకా తెలియలేదు. అసలు ఎవరిని తీసుకోవాలని అనుకుంటున్నారన్న క్లూ కూడా బయటకు రాలేదు. ప్యారడైజ్ సినిమాలో నాని సర్ ప్రైజ్ రోల్ లో కనిపిస్తాడట. ఫస్ట్ టీజర్ తోనే రెండు జడలతో నాని ఇచ్చిన షాక్ తెలిసిందే. అంతేకాదు సినిమా ఎంత ఒరిజినల్ గా ఉంటుందో అందులోని డైలాగ్స్ కూడా అదే రేంజ్ లో ఉండేలా ఉన్నాయి. సెన్సార్ కి ఈ సినిమా బాగా పనిచెప్పేలా ఉందని టీజర్ చూస్తేనే అర్థమవుతుంది.

**పాన్ ఇండియా స్టార్..**

ప్యారడైజ్ సినిమా దసరా గిఫ్ట్ కోసమే నాని అంతా రెడీ చేస్తున్నాడట. ఈసారి టీజర్ లో మరింత వైల్డ్ గా క్రేజీగా ప్లాన్ చేస్తున్నాడట నాని. శ్రీకాంత్ ఈ సినిమాతో కచ్చితంగా పాన్ ఇండియా స్టార్ డైరెక్టర్స్ లో ఒకడిగా మారతాడని అంటున్నారు. ఈ సినిమా పూర్తి చేసి నాని సుజిత్ డైరెక్షన్ లో సినిమా చేయనున్నాడు. నాని ప్యారడైజ్ సినిమా షూటింగ్ అంతా కూడా చాలా సీక్రెట్ గా చేస్తున్నారట. సినిమాలో యాక్షన్ ఘట్టాలు కూడా సంథింగ్ స్పెషల్ అనిపిస్తాయట. తెలుగు తెర మీద ఇదివరకు ఎప్పుడు చూడని ఒక కథతో నాని శ్రీకాంత్ ప్యారడైజ్ వస్తుందని అంటున్నారు. ఐతే ఈ సినిమా కథకు కొన్ని రియల్ ఇన్సిడెంట్స్ కూడా రిఫరెన్స్ అని తెలుస్తుంది. నానిని మరోసారి టాప్ రేంజ్ లో నిలబెట్టేలా ప్యారడైజ్ ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాలో నాని క్యారెక్టరైజేషన్ ఏకంగా నేషనల్ అవార్డ్ కూడా తెచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com